## సంపాదకీయం

# తగదు తగదు..

తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు జరిగిన అపచారం జాతి నవనాడులను కుంగదీసింది. నాగరిక ప్రపంచం ఇటువంటి దుస్సంఘటనలను ఎన్నటికీ అంగీకరించదు. జాతి జనులకు మార్గదర్శనం చేసిన మహనీయుడు అంబేద్కర్. అంతటి మహోన్నత వ్యక్తి విగ్రహాలను దుండగులు ధ్వంసం చేయడం తీవ్ర ఆవేదన కల్గిస్తోంది. బాబాసాహెబ్ ఒక మతానికో, ఒక కులానికో, ఒక వర్గానికో చెందిన వారుగా ఎన్నటికీ పరిగణించజాలము. ఆయన రగిలించిన చైతన్యం కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ వస్తోంది. భారతీయ సంస్కృతిలో విగ్రహాలకు విశిష్టమైన, పవిత్రమైన స్థానం ఉంది. ప్రజలకు అందించిన సేవలకు గుర్తుగా, భావితరాల్లో స్ఫూర్తిని నింపడానికి మహానుభావుల విగ్రహాలను ప్రతిష్టిస్తాం. స్మరించుకుంటాం. ఇంతటి ఉదాత్తమైన సంప్రదాయానికి కొందరి దుందుడుకు చర్యల వల్ల తీవ్ర విఘాతం కలగడం సహించరానిది. అమలాపురంలో అంబేద్కర్ విగ్రహాలకు అపచారం చేసిన వ్యక్తులు, శక్తులను కఠినంగా శిక్షించాలి. గతంలోను అనేక సంఘటనలు జరిగినా పునారావృత్తం కావడం కలచివేస్తోంది. ఇటువంటి అనాగరిక చర్యలకు సమాజం సిగ్గుపడాలి. విగ్రహాలకు రోజూ దండలు వేసి, పూజలు నిర్వహించకపోవచ్చు. అయితే, వాటిని అపవిత్రం చేయడానికి ఎవరైనా సాహసిస్తే ప్రజలు సహించరుగాక, సహించరు. దళితజన ఉద్ధారకుడిగాను, రాజ్యాంగ నిర్మాతగానూ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను విశ్లేషిస్తుంటారు. కానీ వాస్తవానికి ఆయన భారతీయ సమాజాన్ని ప్రపంచంలో మహోన్నతమైన స్థానంలో నిలబెట్టడానికి జీవిత పర్యంతం తపించారు.

కుల వ్యవస్థ నిర్మూలనతోనే ఆధునిక భారతం ఆవిర్భవిస్తుందని త్రికరణశుద్ధిగా నమ్మిన మహానేత అంబేద్కర్. సమాజంలో వ్యక్తుల మధ్య అంతరాలను రూపుమాపి తద్వారా అణగారిన వర్గాలను జాతిజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి అంబేద్కర్ చేసిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తి దాయకం. అందుకే ఆయన జనం మనస్సుల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. అమలాపురం ఘటనకు సమాజం సిగ్గుతో తలవంచుకోవాలి. ఈ విషాదకర ఘటన ఏదో ఒక సామాజిక వర్గానికి సంబంధించినది ఎంతమాత్రం కాదు. ప్రతివ్యక్తీ గొంతువిప్పాలి. ఇటువంటి అరాచక ఘటనలు పునారావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలి. అది అమలాపురం నుంచే ఆరంభంకావాలి. జాతి జనుల పురోభివృద్ధికి సాయపడిన నేతల విగ్రహాలను అవమానించడం వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతింటాయి. ప్రతీకార దాడులు సంభవిస్తాయి. ఇలాంటి అవాంఛనీయ ధోరణులు ఇటీవల మితిమీరడం ఆందోళన కల్గిస్తోంది. వర్తమానంలో కొంతమంది రాజకీయ నాయకుల ప్రసంగాలు ఆవేదన మిగులుస్తున్నాయి. సమాజంలో శాంతిభద్రతలను కాపాడవలసిన వారే, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం తగదు. ప్రజలమనోభావాలతో రాజకీయాలను ముడిపెట్టడం ప్రమాదకరం. కృత్రిమంగా అశాంతిని సృష్టించే శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అసాంఘిక శక్తులు పరిస్థితులను తమకు అనుగుణంగా మార్చుకోవడానికి పొంచి ఉన్న తరుణంలో పార్టీలు, ప్రజలు వివేకంతో వ్యవహరించాల్సి ఉంది. కుల,మతాలకు అతీతంగా మహా మనుషుల విగ్రహాలను గౌరవించినపుడే, సమాజమూ అభివృద్ధి చెందుతుంది. భావితరాలకు ఆదర్శంగా నిలబడాలంటే, మనలను మనం సంస్కరించుకోవాల్సి ఉంటుంది. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు జరిగిన అపచారానికి భారతీయులుగా సిగ్గుపడాలి. ఏహ్యమైన ఇటువంటి అమానుష చర్యలను మొత్తం సమాజం ఏకకఠంతో నిరసించాలి. భవిష్యత్‌లో సహించబోమని ప్రజలు గొంతు విప్పాలి.